క్లుప్తంగా

ఉన్నత పాఠశాల ప్రాంగణం పరిశీలన

బంటుమిల్లి: అర్తమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ జి. గీతా బాయి శనివారం పరిశీలించారు. ఈ నెల 26వ తేదీన పాఠశాల ఆవరణలో శాఖా పరంగా సమీక్ష సమావేశం ఏర్పాటు చేయనున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని డీఎంహెచ్ఓ స్థానిక వైద్యులు, సిబ్బందితో కలిసి పాఠశాల ఆవరణను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. బంటుమిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పవన్‌కుమార్, హెచ్‌ఎం రామచంద్రరావు, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో మేయర్ వెంకటేశ్వరమ్మ



మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ శనివారం విజయవాడలోని కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకోగా అరచకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో జరిగిన చండీ హోమంలో ఆమె పాల్గొన్నారు. మేయర్‌కు అమ్మవారి చిత్రపటాన్ని ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు అందజేశారు.

లక్ష్మీ గణపతి హోమం

మోపిదేవి: మోపిదేవి ఆర్య వైశ్య కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన గణేశుని విగ్రహం వద్ద శనివారం లక్ష్మీ గణపతి హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా గణపతి విగ్రహాన్ని నెలకొల్పారు. వేద పండితులచే శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, హోమాలు జరిపించారు. 8 మంది దంపతులు హోమంలో పాల్గొన్నారు. కమిటీ సభ్యులు కంతేటి శ్యామ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎమ్మెల్యేకు నేతల కృతజ్ఞతలు

నాగాయలంక: దీవులు, మండలానికి చెందిన పలువురు నాయకులు శనివారం అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావును కలిశారు. ఎదురుమొండి వంతెన నిర్మాణానికి కృషి చేసిన వీరికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి, నాగాయలంక జెడ్పీటీసీ మోకా బుచ్చిబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భోగాది వెంకట శేషగిరిరావు, ఈలచెట్లదిబ్బ నాయకులు చెన్ను నాగపుష్పారావు, చెన్ను వెంకటేశ్వరరావు, నాచుగుంట ఎంపీటీసీ కె.యానాది, నాయకులు పాల్గొన్నారు.

రేపు ప్రమాణ స్వీకారం

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని భావన్నారాయణ స్వామి దేవస్థానం 10వ వంశపారంపర్య ధర్మకర్తగా భోగాది విశ్వేశ్వరరావు నియమితులయ్యారని ఈఓ పామర్తి సీతారామయ్య శనివారం తెలిపారు. ఎండోమెంట్స్ ట్రిబ్యునల్ ఉత్తర్వుల మేరకు ఈ నియమకం జరిగిందన్నారు. సోమవారం ధర్మకర్త ప్రమాణ స్వీకారం చేస్తారని చెప్పారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు హాజరవుతారన్నారు.

ప్రతి గడపకూ సురక్షిత నీరు అందిస్తాం

మంత్రి జోగి రమేష్



స్వామిత్వ సభలో శాశ్వత రిజిస్టర్డ్ ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న మంత్రి జోగి రమేష్

పెడన: ప్రతి గడపకూ సురక్షిత తాగునీరు అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. పెనుమల్లి గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పథకం కింద రూ.70 లక్షలతో ఏర్పాటుచేసిన 213 మంచినీటి కుళాయిలను మంత్రి శనివారం ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం నుంచి రూ. 45 లక్షలు, గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా రూ.20 లక్షలు, మండల పరిషత్ నుంచి రూ.3.50 లక్షలు, సర్పంచ్ గరికపాటి వెంకట రామానాయుడు తన తండ్రి పేరు మీద ఇచ్చిన రూ.1.50 లక్షలతో పెనుమల్లి గ్రామంలో 213 కుళాయిల ద్వారా ప్రతి రోజూ సురక్షిత తాగునీటిని సరఫరా చేస్తామని చెప్పారు.

విలువైన ఆస్తికి పక్కా రిజిస్టర్డ్ ధ్రువీకరణ పత్రాలు

పెనుమల్లి గ్రామ సచివాలయం వద్ద వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకంలో భాగంగా స్వామిత్వ కార్యక్రమం ద్వారా పెడన నియోజకవర్గంలోని పెడన మండలం నేలకొండపల్లి, కొంగంచర్ల (కుమ్మరిగుంట), బంటుమిల్లి మండలం కొర్లపాడు గ్రామాల్లో గ్రామ కంఠం భూముల్లో నివసిస్తున్న 611 మందికి ఆస్తి యాజమాన్య ధ్రువీకరణ పత్రాలు సిద్ధమయ్యాయి. పెడన మండలంలోని వారికి మంత్రి శనివారం వీటిని అందజేశారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీ సర్వే చేపట్టారన్నారు. రాష్ట్రమంతా ప్రతి గ్రామంలో సర్వే చేసి హక్కులేని భూములు, ఇళ్ల యజమానులకు హక్కు పత్రాలు రిజిస్ట్రేషన్ చేసి అందిస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా నేలకొండపల్లి గ్రామ పరిధిలో 262 మందికి, కొంగంచర్ల గ్రామ పరిధిలో 121 మందికి ఆస్తి యాజమాన్య హక్కులు అందించామని చెప్పారు. ఆయా కార్యక్రమాలలో పెడన ఎంపీపీ వాణి, పెడన మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చారుమతి, గూడూరు ఎంపీపీ మధుసూదనరావు, పెనుమల్లి సర్పంచ్ రామానాయుడు, మండల కన్వీనర్ నాగబాబు, మాజీ ఎంపీపీ అచ్యుతరావు, తహసీల్దార్ మధుసూదనరావు, ఎంపీడీఓ రెడ్డయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి డీఈ హేమ స్రవంతి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, స్థానిక నాయకులు, వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.



కుళాయిలను ప్రారంభించి నీటి బిందెలను మహిళకు అందజేస్తున్న మంత్రి జోగి రమేష్

వినాయకా.. సెలవిక



మోపిదేవిలో నిమజ్జనానికి తరలివెళుతున్న గణపయ్య



లక్ష్మీనారాయణపురంలో నిమజ్జనానికి వెళుతున్న వినాయకుడు

మోపిదేవి: వినాయక చవితి సందర్భంగా గత ఆరు రోజులుగా విశేష పూజలు అందుకున్న గణనాథుని విగ్రహాన్ని శనివారం సాయంత్రం సమీపంలోని కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. మోపిదేవి గొడపాలెం రామాలయం వద్ద నెలకొల్పిన గణేశుని విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. దారి పొడవునా మహిళలు పండ్లు, పూలు, టెంకాయలు కొట్టి హారతులు ఇచ్చారు. డప్పు కళాకారుల సందడి మధ్య యువకుల కేరింతలతో మోపిదేవి వార్పు వద్ద కృష్ణానదికి ప్రతిమను తరలించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

ఘనంగా వినాయక నిమజ్జనాలు

బంటుమిల్లి: మండల పరిధిలోని జానకీరామపురం, బంటుమిల్లి వినాయక గుడి, ముంజులూరు తదితర గ్రామాల్లో చవితి పందిళ్ల వద్ద పెద్దఎత్తున ఏర్పాటుచేసిన అన్నసమారాధనలో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. అలాగే లక్ష్మీనారాయణపురం, బంటుమిల్లి కనకదుర్గ అమ్మవారి గుడి గ్రామాల్లోని వినాయక విగ్రహాలను ట్రాక్టర్లపై ఉంచి మేళతాళాలు, కనకతప్పెట్లతో వీధుల్లో ఊరేగించి బంటుమిల్లి ప్రధాన కాలువలో నిమజ్జనం చేశారు.

చల్లపల్లి: చల్లపల్లి, రామానగరం, లక్ష్మీపురం, మంగళాపురం, వక్కలగడ్డ, వెలువోలు, నడకుదురు, పురిటిగడ్డ, యార్లగడ్డ, మాజేరు గ్రామాల్లో ఉత్సవ కమిటీల పెద్దలు గణపయ్యల నిమజ్జనాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యువత డప్పువాయిద్యాలకు చిందులు వేస్తూ సందడి చేశారు. విగ్రహాలను కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.

త్వరలోనే ఎదురుమొండి వారధి నిర్మాణం

అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: ఏటిమొగ–ఎదురుమొండి వారధి పనులు త్వరలోనే ప్రారంభిస్తామని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిషేధిత భూముల సమస్య పరిష్కరించి పదివేల మంది రైతులకు మేలు చేశామన్నారు. ఎదురుమొండి వారధి నిర్మాణం చేపట్టాకే ఓటు అడుగుతానని గతంలో చెప్పానని, ఈ నెలలో టెండర్ల ప్రక్రియ జరుగుతుందని, ఖచ్చితంగా పనులు ప్రారంభించిన తరువాతనే దీవులకు వెళ్లి ఓట్లు అడుగుతానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

బుద్ధప్రసాద్ డైవర్ట్ రాజకీయాలు ..

నియోజకవర్గంలో మేము మంచి పనులకు శ్రీకారం చుట్టినప్పుడే మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్‌కు సమస్యలు గుర్తొకు వస్తాయని, ప్రజలను దారి మళ్లించేందుకు డైవర్ట్ రాజకీయాలు చేస్తున్నారని ఎమ్మెల్యే సింహాద్రి ఎద్దేవా చేశారు. గతంలో 22 నిషేధిత భూముల సమస్య పరిష్కారం సందర్భంగా అవనిగడ్డలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సభకు రెండు రోజుల ముందు కోడూరు మండలం తీర ప్రాంత గ్రామాలకు వెళ్లి ముంపు సమస్య లేవనెత్తారని, ఆధునికీకరణ నిధులతో అవుట్‌ఫాల్ స్లూయిస్‌లు నిర్మించక పోవడం వల్లనే రైతులకు ముంపు సమస్య తలెత్తిందన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం అవనిగడ్డలో త్వరలో డయాలసిస్ సెంటర్ ప్రారంభించనున్నామని తెలుసుకుని నాగాయలంక వెళ్లి నిలిచిపోయిన క్రీడల భవనం గురించి మాట్లాడారని చెప్పారు.

వైఎస్సార్ సీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరు

రెచ్చగొట్టేలా మాట్లాడి అలజడి సృష్టించడం, కాపుల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న పవన్ కల్యాణ్ ఆటలు సాగవన్నారు. తెలుగుదేశం, జనసేన కలిసి పోటీచేసినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు మాట్లాడుతూ గత పాలకులు ఎన్నో సంవత్సరాల నుంచి చేయలేని ఎదురుమొండి వారధి నిర్మాణం మా ప్రభుత్వం చేసి చూపిస్తుందన్నారు. సమావేశంలో నాగాయలంక, అవనిగడ్డ, కోడూరు, ఘంటసాల జెడ్పీటీసీలు మోకా బుచ్చిబాబు, చింతలపూడి లక్ష్మీ నారాయణ, యాదవరెడ్డి సత్యనారాయణ, తుమ్మల మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, నాగాయలంక, అవనిగడ్డ, ఘంటసాల మండల కన్వీనర్లు భోగాది శేషగిరిరావు, రేపల్లె శ్రీనివాసరావు, వేమూరి వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

పెడన: తోటమూలలోని భట్ల మోహనరావు, హైమవతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఇతర పాఠశాలలకు బదిలీ అయిన ఉపాధ్యాయులను శనివారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. గణిత ఉపాధ్యాయిని ఎం. శారద, వ్యాయామ ఉపాధ్యాయులు పి. వీరబాబు, ఎస్ఎస్ఏ పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్ పి. ప్రసాద్‌లను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. వారు పాఠశాలకు అందించిన సేవలను కొనియాడారు. ఇంటర్మీడియెట్ బోర్డు విశ్రాంత అధికారి మట్టా రాధాకృష్ణమూర్తి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ

కోనేరుసెంటర్: రసాయన శాస్త్ర విభాగం విద్యార్థులకు శనివారం కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ ఇచ్చారు. కృష్ణా విశ్వవిద్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో లైఫ్ స్కిల్ ట్రైనర్, ఆంగ్ల విభాగం అధిపతి డాక్టర్ ఎం. కోటేశ్వరరావు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు తమ సబ్జెక్టులో ఎలా ప్రతిభ చూపాలి, భవిష్యత్‌ను ఎలా మలచుకోవాలి తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ రామశేఖర్‌రెడ్డి, సహాయ ఆచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓబీసీ ప్రత్యేక కోటా ఇవ్వాలి

మచిలీపట్నంటౌన్: కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన మహిళా బిల్లులో ఓబీసీలకు ప్రత్యేక కోటా ఇవ్వాలని, లేకుంటే ఉద్యమిస్తామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళా నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సంఘం మహిళా విభాగం రాష్ట్ర నాయకులు తిలకచూరి రాజ్యలక్ష్మి, కుంభా ఆదిలక్ష్మి, నారగాని వాణి, లతీఫున్నీసా తదితరులు పాల్గొని ఓబీసీ మహిళలకు ప్రత్యేక కోటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి ఓబీసీ కోటాను బిల్లులో చేర్చకుంటే ఆందోళన కార్యక్రమాలకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి షేక్ మౌలాలి, జిల్లా అధ్యక్షుడు కుక్కల వీర వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

మంచి చేసే జగన్‌ను మళ్లీ ఆశీర్వదించండి

మంత్రి జోగి రమేష్



వృద్ధురాలి సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి జోగి రమేష్

పెడన: పేదలకు మంచి చేయాలనే తపనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని, ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. శనివారం మధ్యాహ్నం ముచ్చర్ల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ పెనుమల్లి నుంచి ముచ్చర్ల గ్రామానికి మంచి రహదారి నిర్మించామన్నారు. గ్రామంలోకి ప్రవేశించే రహదారి కొంతమేర పాడైందని, త్వరలో అభివృద్ధి చేస్తామని, ఇప్పటికే మెటీరియల్ సిద్ధం చేశామని చెప్పారు. గ్రామంలో దెబ్బతిన్న అంతర్గత రహదారులను అభివృద్ధి చేసేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు అన్నీ చేస్తున్న జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పెడన మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చారుమతి, ఎంపీపీ వాణి, గూడూరు ఎంపీపీ మధుసూదనరావు, వైస్ ఎంపీపీ వరప్రసాద్, పెనుమల్లి సర్పంచ్ రామానాయుడు, ముచ్చర్ల సర్పంచ్ జగన్‌మోహన్‌రావు, మండల కన్వీనర్ నాగబాబు, అచ్యుతరావు, ఎంపీడీఓ రెడ్డయ్య, తహసీల్దార్ మధుసూదనరావు, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

హోమియో వైద్యుడు శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళి



శ్యాంప్రసాద్ ముఖర్జీ (ఫైల్)

మచిలీపట్నంటౌన్: ప్రభుత్వ రిటైర్డ్ హోమియో వైద్యుడు కొండేటి శ్యాంప్రసాద్ ముఖర్జీ (68) శనివారం తెల్లవారుజామున మృతిచెందారు. శ్యాంప్రసాద్ గుడ్లవల్లేరు, మచిలీపట్నంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో హోమియో వైద్యునిగా సేవలు అందించారు. ఆయన భార్య దోవారి ధనలక్ష్మి బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా పని చేస్తున్నారు. ఆయనకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోర్టు రోడ్డులోని ఆయన నివాసం వద్ద మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), పలువురు నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

28న షిర్డీ సాయి మందిరం ప్రారంభం

వక్కపట్లవారిపాలెం(నాగాయలంక): వక్కపట్లవారి పాలెం గ్రామంలోని షిర్డీ సాయి మందిరం ఈనెల 28వ తేదీన ప్రారంభిస్తామని నిర్మాణకర్తలు సాయి పురోహిత్ పద్మావతి, బండ్రెడ్డి వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా సాయి కోటి నామ లిఖిత మహాయజ్ఞం, పగలు 12 గంటల పాటు అఖండ సాయి నామ సంకీర్తన జరుగుతాయన్నారు. ఉదయం 10.30 గంటలకు మూడు కోట్ల సాయి నామం గల సాయికోటి పుస్తకాలతో గ్రామంలో ఊరేగింపు, మధ్యాహ్నం 1.30 గంటలకు వాటిని ప్రత్యేకంగా నిర్మించిన స్థూపంలో నిక్షిప్తం, బాబా విగ్రహ ప్రతిష్ఠ, సామూహిక సాయి సత్య వ్రతం, బాబా వారి హారతులు, సత్సంగ ప్రసంగాలు ఉంటాయని వివరించారు.

ఆక్యుప్రెజర్‌తో దీర్ఘకాలిక వ్యాధుల నివారణ



మచిలీపట్నంటౌన్: దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు ఆక్యుప్రెజర్, అయస్కాంత వైద్యం ఎంతగానో దోహదం చేస్తోందని వైద్యులు ధనరాజ్ చౌదరి, రేవంత్ చౌదరి అన్నారు. స్థానిక గాంధీనగర్‌లోని ఉదయపు నడక మిత్రమండలి భవనంలో శనివారం ఆక్యుప్రెజర్, అయస్కాంత వైద్యశిబిరం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాంమనోహర్ లోహియా ఆరోగ్య జీవన్ సంస్థాన్ సంస్థ ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. శిబిరం ఆరు రోజుల పాటు జరుగుతుందని చెప్పారు. వ్యాధిగ్రస్తులు శిబిరానికి వచ్చి వైద్యసేవలు పొందవచ్చనన్నారు. ఉదయపు నడక మిత్రమండలి అధ్యక్షుడు పినిశెట్టి మధుసూదనరావు, కార్యదర్శి యెండూరి సురేష్, పరిశె రాంబాబు, సభ్యులు పాల్గొన్నారు.

సందడిగా చవితి ఉత్సవాలు



కూడూరులో టెంకాయ కొడుతున్న మంత్రి జోగి రమేష్



కోడూరులో వినాయకుడి కల్యాణం



కలెక్టరేట్ వద్ద మట్టి గణనాథుని నిమజ్జనం



కరెన్సీ నోట్ల అలంకరణలో గణనాథుడు

కోడూరు: వినాయక చవితి ఉత్సవాలు సందడిగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలు శనివారం ఆరో రోజుకు చేరాయి. మెరకగొడపాలెం రామాలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ లంబోదరుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల వినాయకుడి కల్యాణాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మూడు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. జయపురం, కృష్ణాపురం గ్రామాల్లో నెలకొల్పిన గణనాథుల విగ్రహాలను ప్రత్యేక వాహనంలో కోడూరు వీధులు వెంట ఊరేగించి, ఉల్లిపాలెం సమీపంలోని కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.

మచిలీపట్నంటౌన్: కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద మీడియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి విగ్రహ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిమజ్జనం అనంతరం విగ్రహ మట్టిని రామరాజుపాలెం ప్రధాన కాలువలో కలిపారు.

గూడూరు: గూడూరు పంజా సెంటర్‌లోని గణనాథుడిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. స్థానిక యువకులు రూ.10, 20 నోట్లతో అలంకరించిన మండపంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెడన: మండల పరిధిలోని కూడూరులో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాన్ని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ సందర్శించి పూజలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. పట్టణంలోని ఒకటో వార్డులో గణపతి విగ్రహానికి జోగి రాజీవ్ పూజలు నిర్వహించారు.

గణపతి లడ్డూల వేలం

చల్లపల్లి: స్థానిక ప్రధాన కూడలిలోని లక్ష్మీ గణపతి దేవాలయం ఎదుట చవితి పందిరిలో ఏర్పాటు చేసిన 36 కిలోల లడ్డూకు శుక్రవారం రాత్రి వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన మార్గాని గోపీ, సాయి సోదరులు తమ తండ్రి మార్గాని శ్రీనివాసరావు జ్ఞాపకార్థం రూ.72,616లకు గణపతి లడ్డూ సొంతం చేసుకున్నారు. అనంతరం స్వచ్ఛ సుందర చల్లపల్లి ఉద్యోగి బండి శ్రీనివాసరావు బహూకరించిన ఐదు కిలోల లడ్డూకు వేలంపాట నిర్వహించగా మెండు బాబీ రూ.12,116లకు సొంతం చేసుకున్నారు.

నాగాయలంక: స్థానిక ప్రసన్న గణపతి దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో స్వామి వారి ఉత్సవ విగ్రహం వద్ద ఉంచిన 25 కిలోల లడ్డూ ప్రసాదానికి శనివారం రాత్రి వేలంపాట నిర్వహించారు. ఈలచెట్లదిబ్బ గ్రామస్తుడు కొక్కిలిగడ్డ శివ రూ.64,116లకు దక్కించుకున్నాడు.